క్లుప్తంగా

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి



హెచ్‌ఎం రామచంద్రారెడ్డితో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ హనుమంతరావు

ఓర్వకల్లు: ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని డిప్యూటీ ఈఓ హనుమంతరావు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల సంఖ్య, వారి సామర్థ్యాలను హెచ్‌ఎం రామచంద్రారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడికి తలొగ్గకుండా, ప్రశాంతంగా ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 శ్రీధర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్లమల్లాపురంలో కాటసాని పూజలు



పూజలు చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: చెట్లమల్లాపురం గ్రామంలో మహాగణపతి, కుమారస్వామి, నందీశ్వర, పూర్వక పార్వతి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ సముదాయం విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శ్రీ శ్రీ సుంకులపరమేశ్వరి ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపాల్‌రెడ్డి, నాయకులు మధు, వెంకటరెడ్డి, పురుషోత్తం, దామోదర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగివుండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్: సైబర్ నేరాలపై అవగాహన కలిగివుండాలని ఎస్‌ఐ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని అమడుగుంట్ల గ్రామంలో ఎస్‌ఐ పర్యటించి హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఫోన్లకు వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పరాదన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలన్నారు.

శాంతిరామ్‌లో టాలెంట్ షైన్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో టాలెంట్ షైన్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి స్కిల్ కోడింగ్‌లో పాల్గొంటే భవిష్యత్ ఉన్నత శిఖిరాలకు చేరుకుంటారన్నారు. అనంతరం ప్రాజెక్టర్ ద్వారా వివరించారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మకు బోనాలు



అమ్మవారికి బోనాలతో వెళ్తున్న మహిళలు

కోడుమూరు రూరల్: మండలంలోని అనుగొండ గ్రామంలో బుధవారం పోచమ్మ దేవర ఉత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవర ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

22 నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): జార్ఖండ్‌లోని రాంచీలో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు 53వ జాతీయ స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సత్యసాయి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.



సేవకు పయణం

కోడుమూరు రూరల్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి వచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు గూడూరు నుంచి నీలకంఠేశ్వర భక్త బృందం సభ్యులు బుధవారం లారీలో సరుకులను తీసుకెళ్లారు. ఈనెల 20 నుంచి 27 వరకు శ్రీశైలంలో తాము భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి వచ్చే భక్తులకు 23 ఏళ్ల నుంచి తాము అన్నదానం చేస్తున్నామని భక్తబృందం సభ్యులు తెలిపారు.



పొగాకు పనుల్లో బిజీబిజీ

కల్లూరు: గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మండల వ్యాప్తంగా పొగాకు పంట సాగు పెరిగిందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. సాధారణంగా రైతులు వ్యవసాయ కూలీలతో పొగాకు దోర్నాలు కుట్టి వాటిని ఆరబెడతారు. పొగాకు సాగు పెరగడం వల్ల కూలీలకు డిమాండ్ పెరిగింది. గత ఏడాది ఒక దోర్నం కుడితే రూ.15 ఉండగా ఈ ఏడాది ఒక దోర్నం కుటడానికి రూ. 20 అయ్యింది. కూలీలు దొరక్కపోవడంతో రైతులు ఇళ్ల వద్దకే పొగాకును తీసుకువస్తున్నారు. బస్తిపాడు గ్రామంలో ఉదయం, రాత్రి సమయంలో వీధుల్లో కుటుంబ సభ్యులు, కూలీలు పొగాకు దోర్నాలు కుడుతూ పనుల్లో బిజీబిజీ ఉన్నారు. రెమడూరు, పుసులూరు, బొల్లవరం, బస్తిపాడు, లక్ష్మీపురం గ్రామాల్లో కల్లాల దగ్గర ఎక్కడ చూసిన పొగాకు దోర్నాలు కనిపిస్తున్నాయి.

పడిదెంపాడు గ్రామంలో డ్రైనేజీలో లీక్ అవుతున్న తాగునీటి పైప్‌లైన్



తాగునీరు కలుషితం!

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పడిదెంపాడు గ్రామంలో బీసీ కాలనీలో పైప్‌లైన్లు లీక్ అయ్యి తాగునీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం గ్రామంలో జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. ఇదే విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తాగునీరు కలుషితం కాకుండా పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

జగన్‌పై తప్పుడు పోస్టులు పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సి.బెళగల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి ముందరింటి గోపాల్ కోరారు. పార్టీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహుడు, డాక్టర్ల వింగ్ అధ్యక్షుడు ముల్లహారున్, మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన ఎస్‌ఐ తిమ్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శులు ముందరింటి వెంకటేష్, నాయకులు ఎస్‌ఎం బాషా, సర్పంచ్ పాండురంగన్న పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై చైతన్యం చేయండి

● జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్



సిబ్బందితో అధికారి జి.భాస్కర్

కర్నూలు(రూరల్): పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ సిబ్బందికి సూచించారు. గార్గేయపురం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. చెత్తను రోడ్ల పక్కన, కాలువల్లో, ఊరి శివారు ప్రాంతాల్లో పడేయరాదన్నారు. తడి, పొడి చెత్తలతోను వేర్వేరు చెత్త బుట్టల్లో నిల్వ ఉంచి పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించాలన్నారు. పంచాయతీ ఖాతా జామ చేసి.గ్రామానినికి ఆదాయం తీసుకురావాలనేది కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఆదోని పంచాయతీ డివిజన్, కర్నూలు డివిజన్ పంచాయతీ అధికారులు, గార్గేయపురం పంచాయతీ సెక్రటరీ పురుషోత్తం పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



సి.బెళగల్ హెల్త్ సర్వేను తనిఖీ చేస్తున్న జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు

సి.బెళగల్: ప్రజలు ఎవరికి వారు ఆరోగ్య సూత్రాలు పాటించాలని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది చేపట్టిన వైద్య సేవలు, వైద్య సర్వేలను ఆయన స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సునీతతో కలిసి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మారిన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాలతో అధిక రక్తపోటు, మధుమేహం (సుగర్), క్యాన్సర్ లాంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. మద్యం, పొగాకు అలవాట్లతో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, క్యాన్సర్ వంటి వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించి, సకాలంలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట హెల్త్ ఎడ్యుకేటర్ పుష్పావతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు అరుణ కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రభావతి, ఆశా వర్కర్లు రంగమ్మ, జమాల్‌బీ ఉన్నారు.

నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



గూడూరులో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం సీపీఎం నాయకులు గూడూరు పాతబస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కార్పొరేట్ శక్తులకు మాత్రమే ఉపయోగపడే విధంగా ఉందని, రైతులకు, కార్మికులకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బడ్జెట్లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్రానికి నిధులు తెప్పించడంలో ఇక్కడి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బడ్జెట్లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతున్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి రాష్ట్రంలో వెనుకబడ్డ ప్రాంతమైన రాయలసీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ముఖ్యంగా కర్నూలు జిల్లా అభివృద్ధికి గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని మోహన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు చిన్న రాజు, సుధాకర్, సురేష్, అబ్రహం, సీఐటీయూ నాయకులు ప్రభుదాసు, డేవిడ్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందన



నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌కు ఎంపికైన వలంటీర్లను అభినందిస్తున్న వీసీ బసవరావు, తదితరులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వి.బసవరావు అభినందించారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో వైఎన్ కళాశాలలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో పాల్గొన్న ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పి.లోకేష్, బి.దీపిక, వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజుతో కలిసి బుధవారం వీసీ ఛాంబర్‌లో ఆయన్ను కలిశారు. వారికి వీసీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అలాగే ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు బెంగుళూరులోని సెయింట్ జోసఫ్స్ యూనివర్సిటీ పరిధిలోని సెయింట్ జోసఫ్స్ ఔట్‌రీచ్ సెంటర్‌లో జరిగే నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌కు ఎంపికైన ఆర్‌యూసీఈ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కె.సాయిలిఖిత, డి.జమీల్, బి.ప్రవీణ్, జి.భీరలింగ, ఇ. హరిబాబు, నగరంలోని సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు బి.రాధమ్మ, ఎం.ఖాదిర్ బాషా, కె.మేఘన, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.నాగచంద్రుడును వైస్‌చాన్స్‌లర్ బసవరావు, రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడు అభినందించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్ రెడ్డి ఉన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో సత్తా చాటాలి



రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే స్త్రీ, పురుషుల జట్లు

కర్నూలు (టౌన్): తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న 48వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని స్పోర్ట్స్ ప్రమోటర్ జి.శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. బుధవారం స్థానిక నగర శివారులోని వెంకాయపల్లె సెయింట్ జోసఫ్ మహిళా కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాల సీనియర్స్ స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెన్నికాయిట్ క్రీడల వల్ల చురుకుదనం, మానసిక ఉల్లాసం అలవడుతుందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామల, సురేష్, రవి, గోకారి, సూరి పాల్గొన్నారు.

27న రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు

ఓర్వకల్లు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 27న కాల్వబుగ్గలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, కేవీ మధు బుధవారం తెలిపారు. మొదటి స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే అదేరోజు అంతర్రాష్ట్ర వాలీబాల్ పోటీలు ఉంటాయని, ఇందులో గెలుపొందిన మొదటి ఐదు జట్లకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.5 వేల చొప్పున బహుమతులు అందజేయస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు అదే రోజు ఉద యం 8 గంటల్లోగా రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98663173182, 9398401721, 9949071579 సంప్రదించాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి సూచించారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సోషల్ మీడియాల ద్వారా సైబర్ నేరగాళ్లు ఉద్యోగ అవకాశాలు, సులభంగా డబ్బు పొందే మార్గాలంటూ లింక్‌లను పంపించి, వాటి ద్వారా బ్యాంక్ ఖాతాలను హ్యాక్ చేసి డబ్బు కొల్లగొడుతున్నారన్నారు. తెలియని నంబర్ల నుంచి లింక్‌లు వచ్చినా ఓపెన్ చేయకూడదని, ఇదే విషయాన్ని తల్లిదండ్రులకు, ప్రజలు తెలియజేసి వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. అపరితుల వీడియో కాల్స్, లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీస్‌లను సంప్రదించి ఫిర్యాదుల చేయాలని, లేదా 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయండి

సి.బెళగల్: సర్వేలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. బుధవారం ఆమె ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్‌తో కలిసి పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. తాగునీటి వనరులను సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శులకు అధికారులు సూచించారు. మరుగుదొడ్లు అవసరమైన వారి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేసి వారి వివరాలను ప్రభుత్వా నికి నివేదించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్నారు. గ్రామాల్లో చేపట్టే పరిశుభ్రత కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నివేదికలలో అభివృద్ధిని కనపరచాలని ఈఓఆర్డీ అన్నారు.

ఆకతాయిల పట్ల అప్రమత్తత అవసరం

కర్నూలు(రూరల్): ఆకతాయిలు, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తాలూకా అర్బన్ స్టేషన్ ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థినులకు సూచించారు. మండలంలోని దిన్నెదేవరపాడు గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్లకు వచ్చే మోసపూరిత లింక్‌లను ఓపెనచేయవద్దని సూచించారు. చెడు వ్యసనాలకు లోను కాకుండా లక్ష్యం నిర్దేశించుకుని చదువుకోవాలన్నారు.

ఆట, పాటలతో బోధించాలి

సి.బెళగల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో బోధించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, సుజాత టీచర్లకు సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై రెండో రోజు శిక్షణ కొనసాగింది. కేంద్రాల నిర్వహణ, బాలల సంరక్షణ, బోధన పద్ధతులపై సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్బీలు పోలకల్ మెయిన్ స్కూల్ హెచ్‌ఎం మునిస్వామి, చింతమానులపల్లె ఉపాధ్యాయుడు ఖడ్గం రాజు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో అభివృద్ధి, మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు కేడీసీసీ బ్యాంకు ఏరియా, సెంట్రల్ ప్లాజా, కొత్త అయ్యప్ప స్వామి ఆలయం ఏరియా, ఆదిత్య నగర్, బ్లడ్ బ్యాంకు, స్వామిరెడ్డి నగర్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈఈ శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏపీజీబీ ఎంఓను కడపలోనే ఉంచాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని వైఎస్సార్ కడపలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో పోస్టర్లను కార్మిక సంఘాల నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడపలో అన్ని వసతులు కలిగిఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని మరో ప్రాంతానికి ఎందుకు తరలిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలా గాకుండా తరలించేందుకు చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకులు సాయిబాబా, కె.నాగరాజు, వెంకటేష్, హరిసుందర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలి



పారిశుద్ధ్యంపై సూచనలు చేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలోని ప్రతి వీధిలో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. బుధవారం నగరంలోని ఆదిత్య నగర్, సంపత్‌నగర్, గురు రాఘవేంద్రనగర్, బిర్లా కాంపౌండ్, వడ్డె గేరి, కేవీఆర్ గార్డెన్స్ తదితర కాలనీలలో విస్తృతంగా పర్యటించారు. పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. కార్మికుల హాజరు పట్టిక మస్టర్‌ను పరిశీలించారు. అలాగే హంద్రీ నది పరివాహక ప్రాంతంలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జన నివాసాలతో పాటు సమీపంలోని నదీ పరివాహక ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యానికి సంబంధించి ప్రజల నుంచి పదే పదే ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రైనీ ఏఈ మహేష్, పారిశుద్ధ్య తనిఖీదారులు అనిల్ కుమార్, అంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఆర్‌డీఏ పీడీ



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైపీ రమణా రెడ్డి

కర్నూలు(సెంట్రల్): డీఆర్‌డీఏ పీడీగా నియతులైన వైపీ రమణారెడ్డి బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనంతపురంలో విజిలెన్స్ విభాగంలో పనిచేస్తూ పీడీగా నియమితులైన విషయం విదిత మే. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాద పూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు

బాలికలకు ఆత్మరక్షణకు క్రీడలు అవసరం



క్రీడా దుస్తులు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): ఆత్మరక్షణ కోసం బాలికలకు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ శిక్షణ అవసరమని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. బుధవారం స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో ఉషా క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20, 21 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడల్లో ప్రతిభ చాటాలన్నారు. జిల్లాకు చెందిన ఉషా క్రీడాకారులు విజయంతో తిరిగి రావాలన్నారు. నగరంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం నిరంతరం అందిస్తామన్నారు. ఉషా శిక్షకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేయించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని తాగునీటి ట్యాంకులను, వాటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం (పీపీఎస్‌ఎస్)రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న తాగునీటి ట్యాంకు పరిసరాలను పీపీఎస్‌ఎస్ సంఘం నాయకులు పరిశీలించారు. ఆ ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. వెంటనే మునిసిపల్ సిబ్బంది పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్పొరేషన్ ఆదాయంపై ప్రశ్నిస్తే కేసులా?

కర్నూలు (టౌన్): కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయంపై ప్రశ్నిస్తే.. తనపై కుట్రపూరితంగా అక్రమ కేసులు మోపడం తగదని నగరపాలక సంస్థ 49వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కృష్ణకాంత్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మద్దెల విజయ్‌రాజు అనే వ్యక్తి స్థానిక ఏ.క్యాంపు వద్ద ఉన్న హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పిటల్ సమీపంలో వీఆర్ఎన్ బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రైవేటు స్థలం లీజుకు తీసుకొని కార్పొరేషన్‌కు వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్, ప్లాన్ అప్రూవల్ లేకుండా వ్యాపారం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గత ఏప్రిల్ నుంచి ఎలాంటి ఫీజు చెల్లించలేదని, తద్వారా కార్పొరేషన్ రూ.15 లక్షల ఆదాయం కోల్పోతున్నట్లు వివరించారు. ఇదే వ్యక్తి 2024 అక్టోబర్‌లో స్థానిక సెయింట్ జోసఫ్ కళాశాల వెనుక ప్రైవేటు స్థలం తీసుకొని 12 సెంట్లలో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేశారని, దీని ద్వారా కార్పొరేషన్ రూ.17 లక్షలు ఆదాయం కోల్పోతుందని పేర్కొన్నారు. ఈ విషయంపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత నెల 30న జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ ఇదే అంశాన్ని లేవనెత్తినట్లు తెలియజేశారు. నగరపాలక సంస్థ అధికారులపై ఒత్తిడి వల్లే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. తనపై నమోదు చేసిన అక్రమ కేసును న్యాయపరంగా ఎదుర్కొంటానని స్పష్టంచేశారు.

● 'లిఫ్ట్' ఇచ్చేదెవరు..?

మనలో ఎవ్వరైనా అభివృద్ధిలోకి రావాలంటే ఎవరో ఒకరు లిఫ్ట్ ఇవ్వాలని చెబుతుంటారు. అంటే వారికి చేయూతనందిస్తే అభివృద్ధిలోకి వస్తాడని అర్థం. అలాగే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో ఉన్న లిఫ్ట్‌కు ఎవ్వరైనా లిఫ్ట్ ఇస్తే గానీ పైకి వెళ్లనంటోంది. ఈ లిఫ్ట్ రెండు, మూడేళ్లుగా పనిచేయడం లేదు. మాతాశిశు భవనంలో గైనిక్, పీడియాట్రిక్స్ విభాగాల వైపు ఒక్కో లిఫ్టులు ఉన్నాయి. ప్రస్తుతం గైనిక్ విభాగం లిఫ్ట్ మాత్రమే పనిచేస్తోంది. పీడియాట్రిక్స్ విభాగం ఉన్న భవనం పై భాగంలోనే ఎస్‌ఐసీయూ, పీఐసీయూ, న్యూరాలజీ, ఎండోక్రైనాలజీ విభాగాలు ఉన్నాయి. ఆయా విభాగాలకు వెళ్లేందుకు లిఫ్ట్ సౌకర్యం లేక రోగులు, వారి సహాయకులు మెట్ల మార్గంలోనే అవస్థలు పడుతూ వెళ్లాల్సి వస్తోంది. రోజుకు ఐదారుసార్లు మెట్లు ఎక్కి దిగలేక ప్రాణం పోతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గైనిక్ వద్ద ఉన్న లిఫ్ట్‌లో కేవలం గర్భిణులు, బాలింతలు, వైద్యులను మాత్రమే అనుమతిస్తున్నారు. చిన్నపిల్లల విభాగంలో ఉన్న లిఫ్ట్‌కు ఆసుపత్రి అధికారులు త్వరగా మరమ్మతులు చేపట్టాలని రోగులు కోరుతున్నారు. – కర్నూలు(హాస్పిటల్)



చిన్నపిల్లల విభాగం వద్ద పనిచేయని లిఫ్ట్